సాక్షి ములుగు

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



ఉన్నతవిద్యను బలోపేతం చేయాలి

ఉన్నత విద్యను బలోపేతం చేసేందుకు బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా కేటాయించాలని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. - 8లో▸



సైన్స్‌తోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సైన్స్‌తోనే సాధ్యమైందని సీసీఎంబీ మాజీ డైరెక్టర్ మోహన్ రావు అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0° /25.0°

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

యూనివర్సిటీ భవన నిర్మాణాలు చేపట్టాలి



ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన గిరిజన యూనివర్సిటీ భవన నిర్మాణాలను వెంటనే చేపట్టాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం గట్టమ్మ సమీపంలో ట్రైబల్ యూనివర్సిటీకి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన యూనివర్సిటీకి సమ్మక్క–సారలమ్మల నామకరణం చేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య పేర్లు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన యూనివర్సిటీలో ఆదివాసీ విద్యార్థులతో పాటు ఎస్సీ, బీసీ, మైనార్టీలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ వీరవేణి రామ్ షెఫర్డ్, ఓయూ అడ్వకేట్ దయ్యాల సుధాకర్, డాక్టర్ కట్టగాని రవీందర్, పీడీఎస్‌యూ మాజీ నాయకులు మహిపాల్‌రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



ములుగు రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ నరేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని రాయినిగూడెం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలతో బాలికల అభివృద్ధికి విఘాతం కలుగుతుందన్నారు. బాలికలు చదువుకుంటేనే వారి భవిష్యత్ బంగారుమయంగా మారుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నేటికి బాల్యవివాహాలు జరుగుతున్నాయని తెలిపారు. బాల్యవివాహాలు చేస్తే తల్లిదండ్రులు, పెళ్లి కుమారుడు, సహకరించిన వారందరిపై కేసులు నమోదు చేస్తామన్నారు. 18ఏళ్ల లోపు పిల్లలకు ఎలాంటి సమస్యలు ఉన్నా 1098, 112కి కాల్ చేయాలని సూచించారు. పిల్లలు లేని తల్లిదండ్రులు దత్తత తీసుకునే క్రమంలో చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్ ప్రసాద్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఎంపీఎస్ కమిటీలు రద్దు

వెంకటాపురం(ఎం): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలంగాణ మాల పోరాట సమితి (టీఎంపీఎస్) కమిటీలను రద్దు చేస్తున్నట్లు టీఎంపీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ టీఎంపీఎస్ 2010లో ఆవిర్భవించిందని, ప్రస్తుతం బూత్‌కమిటీల నుంచి రాష్ట్ర కమిటీల వరకు రద్దు చేస్తున్నట్లు చెప్పారు. కొత్త కమిటీలను ఎన్నుకునే వరకు తాత్కాలికంగా ఉమ్మడి 10 జిల్లాలకు ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు వివరించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



వెంకటాపురం(కె): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఏటీడీవో దేశీరామ్ అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీనగరం బాలుర ఆశ్రమ పాఠశాల నుంచి కాలేజ్ ఆఫ్ ఎక్సెలెన్సీ నందు సీటు పొందిన విద్యార్థులకు సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో ప్రతిభ చూపాలన్నారు. అనంతరం లక్ష్మీనగరం పాఠశాల హెచ్‌ఎం సావిత్రి మాట్లాడుతూ ఇంటర్‌లో ప్రవేశం కోసం కాలేజీ ఆఫ్ ఎక్సలెన్సీలో పాఠశాల విద్యార్థులు 17మంది పరీక్ష రాయగా 11మంది సీటు సాధించారని తెలిపారు. వీరిలో ముగ్గురు విద్యార్థులు హైదరాబాద్ రాజేంద్ర నగర్ ఐఐటీ స్టడీ సర్కిల్‌లో సీటు సాధించారని తెలిపారు. మిగిలిన వారు ఖమ్మం, నల్గొండ, వరంగల్, మెదక్‌లలో సీటు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



ఉగాది ఉషస్సులు..

శ్రీక్రోధి నామ సంవత్సర సందడి..

వేపచెట్లు అమృతాన్ని నింపుకున్న పూలతో ప్రకాశిస్తుండగా.. మామిడి చెట్లు లేలేత పిందెలతో మానవ కల్యాణానికి మంగళగీతాలు పాడుతుండగా.. మోదుగచెట్లు నిప్పు కణికలాంటి పూలతో శోభాయమానం చేస్తుండే రమణీయమైన సొగసుల కాలమే వసంతమే. చైత్ర శుక్ల పాడ్యమి రోజున జరుపుకునే తెలుగువారి తొలి పండుగ ఉగాది. శ్రీక్రోధినామ సంవత్సరానికి స్వాగతం పలికేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని జిల్లాలోని పలు కూడళ్లలో సందడి నెలకొంది. ఉగాది పచ్చడికి అవసరమైన కొత్త కుండలు, చింతపండు, మామిడాకులు, మామిడికాయలు, వేపపువ్వు కొనుగోలు చేశారు. పండుగ రోజు పంచాంగ శ్రవణానికి ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి.

- వివరాలు 8లో▸ - హన్మకొండ కల్చరల్

రామప్పను సందర్శించిన స్పెయిన్ దేశస్తుడు



రామప్ప రామలింగేశ్వర స్వామి సన్నిధిలో ఎడ్రియా

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని సోమవారం స్పెయిన్ దేశానికి చెందిన ఎడ్రియా సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరున్ని దర్శించుకున్న అనంతరం రామప్ప ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎడ్రియా మాట్లాడుతూ రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ అంటూ కొనియాడారు. స్పెయిన్ నుంచి నేపాల్ వరకు 11 నెలలు యాత్ర చేపట్టి ఆయా దేశాల్లో ఉన్న టెంపుల్స్, చారిత్రాక కట్టడాలను చూస్తున్నట్లు వివరించారు. రామప్ప దేవాలయంతో పాటు హంపీ బాగుందన్నారు. ములుగు నుంచి రామప్ప ఆలయానికి కాలినడకన చేరుకున్నట్లు వివరించారు. సోమవారం రాత్రి రామప్పలో బస చేసి మంగళవారం ఉగాది ఫెస్టివల్ రోజున మళ్లీ రామప్ప ఆలయాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు.

పనికి వెళ్లేదెలా..?

ఎండలతో ఉపాధి పనులకు ఆసక్తి చూపని కూలీలు

- పని ప్రదేశాల్లో కానరాని సౌకర్యాలు
- జిల్లా వ్యాప్తంగా 1,98,685 మంది కూలీలు
- ప్రతిరోజూ వెళ్లేది 16వేల లోపే..



వెంకటాపురం(ఎం) మండలంలోని ఉప్పల్ చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

వెంకటాపురం(ఎం): నిరుపేద కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆశించిన స్థాయిలో లక్ష్యం నేరవేరడం లేదు. వ్యవసాయ పనులతో పాటు ఇతర పనుల పైనే కూలీలు ఆసక్తి చూపుతున్నారు. ఉపాధి పనులకు రావాలని ఈజీఎస్ అధికారులు అవగాహన కల్పిస్తున్నా గత ఫిబ్రవరి నుంచే ఎండలు తీవ్రంగా ఉండడంతో కూలీలు పనుల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఉపాధి పనులకు వెళ్లాలంటే కిలోమీటర్ల దూరం ఎండలో నడిచి వెళ్లాల్సి ఉంటుందని, తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని కూలీలు చెబుతున్నారు. అంతేకాకుండా పనుల వద్ద కనీస సౌకర్యాలు అధికారులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేసే ప్రదేశంలో తాగునీటి వసతి, నీడ ఉండేందుకు టెంట్ సౌకర్యం, ప్రమాదవశాత్తు గాయపడితే ప్రాథమిక చికిత్స చేసేందుకు అవసరమైన మెడికల్ కిట్లు అందుబాటులో లేవని విచారం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిరోజూ పనికి 16వేల లోపే..

జిల్లా వ్యాప్తంగా 174 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 84,756 జాబ్ కార్డులు ఉండగా 1,98,685 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ఇందులో 56,581 జాబ్ కార్డులు మాత్రమే యాక్టివ్‌గా ఉండగా 89 వేల మంది ఉపాధి పనులు చేస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. కాని ప్రతిరోజూ 16 వేల మంది లోపే కూలీలు పనులకు హాజరవుతున్నారు. భానుడు ప్రభావంతో ఎండలు తీవ్రంగా ఉండడంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు వెనకడుగు వేస్తున్నారు. తెల్లవారుజామున 5గంటలకు బయలుదేరి పనులకు వెళితే వచ్చేసరికి మధ్యాహ్నం 12గంటలు అవుతుందని కూలీలు చెబుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.300ల కోసం పనికిపోతే వడదెబ్బ తాకి ప్రాణాలమీదికి వచ్చే ప్రమాదం ఉందని కూలీలు వాపోతున్నారు. ఉదయం 9గంటల వరకే ఉపాధి పనులు ముగించేవిధంగా అధికారులు చొరవ తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.



రామన్నగూడెంలో చేస్తున్న రోడ్డు పనులు



ఏటూరునాగారంలో చేస్తున్న పూడికతీత పనులు

రూ.28లు పెరిగిన కూలి

ఉపాధి కూలీలకు అందిస్తున్న కనీస వేతనం రూ.300లకు కేంద్ర ప్రభుత్వం పెంచింది. పెంచిన కూలిని ఏప్రిల్ మాసం నుంచి అమలు చేయాలని సూచించింది. నిరుపేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో 2005లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. మొదట్లో కనీసం వేతనం రూ.87.50లు ఉండగా క్రమక్రమంగా పెంచుతూ 2024 మార్చి వరకు రూ.272లు చెల్లించింది. 2024 ఏప్రిల్ మాసం నుంచి రూ.28లు పెంచి ప్రస్తుతం రూ.300ల కనీస కూలి చెల్లిస్తోంది. అదేవిధంగా కూలీలకు పనిచేసే చోట తాగునీటి వసతి కల్పించేందుకు ప్రభుత్వం ఒక్కొక్క కూలీకి రూ.2.50 చొప్పున గ్రామపంచాయతీలకు చెల్లిస్తుంది.

వారం రోజులుగా పనిచేస్తున్న కూలీల వివరాలు

తేదీ	కూలీల సంఖ్య
1	11,541
2	12,950
3	13,314
4	13,802
5	15,731
6	15,203
7	15,993

ప్రతిరోజూ కూలీల తాగునీటికి జీపీలకు సుమారు రూ.2 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తున్నా పనిచేసే ప్రదేశంలో జీపీ అధికారులు ఇప్పటి వరకు తాగునీటి వసతి కల్పించిన దాఖలాలు లేవు. దీంతో ఉపాధి నిధులన్నీ పక్కదారి పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రెండు వారాల డబ్బులు రావాలి..



గతేడాది తిరుమల్లవాగు సమీపంలో ఉపాధి పనులు చేస్తే ఇప్పటివరకు డబ్బులు చెల్లించలేదు. సుమారు రెండు వందల మందికి పైగా రెండు వారాలకు చెందిన డబ్బులు రావాల్సి ఉంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. కుటుంబ సమేతంగా పనులు చేస్తే వారికి డబ్బులు చెల్లించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు.

- జంగిలి పెద్ద స్వామి, వెంకటాపురం(ఎం)

సౌకర్యాలు కల్పించాలి..



ఉపాధి పనులు చేసే ప్రదేశంలో అధికారులు సౌకర్యాలు కల్పించాలి. తాగునీటిని సైతం ఇంటినుంచి పట్టుకొని వెళ్తున్నాం. కూలీలకు వడదెబ్బ తాకితే తక్షణమే వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి. ఉపాధి పనులను ఉదయం 6గంటల నుంచి చేస్తున్నాం. గతంలో మాదిరిగా కూలీలకు వేసవి భత్యం చెల్లించాలి.

- పుట్టపాక శ్రీనివాస్, వెంకటాపురం(ఎం)

యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు

ఎస్పీ శబరీశ్



వీసీలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ములుగు: జిల్లాలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ శబరీశ్ తెలిపారు. సోమవారం నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రోపిక్ కేసులపై మల్టీజోన్ వన్ ఐజీ ఏవీ.రంగనాథ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్‌డీపీఎస్ కేసుల నమోదు, డ్రగ్స్ సరఫరా నిలుపుదలకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యాంటీ డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే సమారుగా 757, 625 కేజీల గంజాయిని పట్టుకుని ధ్వంసం చేసినట్లు వివరించారు. గంజాయి సరఫరాను అడ్డుకోవడమే లక్ష్యంగా అంతర్ రాష్ట్ర, జిల్లా రహదారులపై వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు ఐజీకి ఎస్పీ వివరించారు. అనంతరం జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ కేసులులేని జిల్లాగా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆదివాసీలకు గంజాయి వాడకం వల్ల కలిగే దుష్పలితాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ గీతే బాబాసాహేబ్, డీఎస్పీ రవీందర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఏటూరునాగారం సీఐ రాజు శంకర్, ములుగు సీఐ రంజిత్ కుమార్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్ ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు కమలాకర్, కృష్ణ ప్రసాద్, రవి కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పరమశివుడి దర్శనం



తూర్పు రోడ్డుకు అడ్డుగా పెట్టిన ట్రాక్టర్ ట్రాలీ



పడమటి రోడ్డులో వసూలుకు పాల్పడుతున్న సిబ్బంది

అభివృద్ధి పేరుతో అక్రమ వసూళ్లు

- తూర్పు ముఖద్వారాన్ని మూసివేయడంతో పర్యాటకుల ఇబ్బందులు
- దోపిడీకి గురవుతున్న సందర్శకులు

వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయం శిల్పకళ సంపదకు పెట్టింది పేరు. 2021లో యునెస్కో గుర్తింపు పొందడంతో ప్రపంచ పటంలోనే రామప్ప ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుంది. పురాతన కట్టడాల్లో, కట్టడాల వద్ద పార్కింగ్ పేరుతో, అభివృద్ధి పేరుతో డబ్బులు వసూలు చేయాలనే నిబంధనలు ఎక్కడ లేవు. రామప్పకు యునెస్కో గుర్తింపు రావడంతో పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో రామప్ప పరిధిలోని పాలంపేట గ్రామ పంచాయతీ అధికారులు రామప్ప వెహికల్ పార్కింగ్ ఫీజు పేరుతో రశీదులు ఇస్తూ రామప్ప ఆలయానికి వెళ్లేదారిలో చెక్‌పోస్టు పెట్టి వాహనాల యజమానుల దగ్గర అక్రమ వసూళ్లు చేస్తున్నారు. పైసలిస్తేనే పరమశివుని దర్శనమవుతుందని బాహాటంగానే పర్యాటకులకు చెబుతున్నారు. బైక్, ఆటోకు రూ.20, కారు, ట్రాక్టర్, జీపు, టాటా ఏస్‌కు రూ.50, బస్సు, లారీ, డీసీఎంకు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు.

ట్రాక్టర్ అడ్డుపెట్టి..

రామప్ప ఆలయాన్ని వాస్తుపరంగా తూర్పుముఖద్వారం నుంచి దర్శించుకోవాలనే నెపంతో లక్షలాది రూపాయలు వెచ్చించి తూర్పురోడ్డును నిర్మించారు. 2021లో రూ.90 లక్షలు వెచ్చించి రెండులేన్ల రహదారిని నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. రామప్ప చెరువు మత్తడి పడి రహదారికి గండ్లు పడగా తాత్కాలికంగా గ్రావెల్ పోసి వాహనాల రాకపోకలను కొనసాగిస్తున్నారు. కాని పార్కింగ్ పేర వసూళ్లు చేసే పంచాయతీ అధికారులు తూర్పురోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్ ట్రాలీని పెట్టి రహదారిని పూర్తిగా మూసివేశారు. దీంతో రామప్పను సందర్శించే పర్యాటకులు తూర్పురోడ్డును మూసివేయడంతో పడమటి రోడ్డు ద్వారా రామప్ప ఆలయానికి వెళ్లే క్రమంలో చెక్‌పోస్టు వద్ద డబ్బులు చెల్లించి ఆలయానికి వెళ్తున్నారు. రామప్పలో పార్కింగ్ పేర అక్రమ వసూళ్లను నిలిపివేసి రామప్పకు వచ్చే పర్యాటకుల సంఖ్యను పెంచి రామప్ప అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పాలంపేట పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరేందుకు సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

మండుటెండలో ప్రకృతి పొగ మంచు



మిట్ట మధ్యాహ్నం.. మండుటెండలో పొగమంచు కురిసింది. గోవిందరావుపేట, చల్వాయి గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండగా పొగ మంచు అలుముకుని చూపరులను కనువిందు చేసింది. ఇంతటి మండుటెండులో పొగ మంచులు ఏమిటి అని వాహనదారులు, బాటసారులు వింతగా చూసి సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు.

- గోవిందరావుపేట

సర్క్యులర్ 1334 రద్దు చేయాలి

ములుగు రూరల్: అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు రిటైర్మెంట్ బెన్ఫిట్స్ చేస్తామని ఇచ్చిన సర్క్యులర్ 1334ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అంగన్‌వాడీ టీచర్లు కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్మెంట్ బెన్ఫిట్స్ అందిస్తామని చెప్పి టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ప్రకటించడం సరికాదన్నారు. గతంలో అంగన్‌వాడీలు 24 రోజులు సమ్మె చేయగా గత ప్రభుత్వం టీచర్లకు రూ. 2లక్షలు, ఆయాలకు రూ. లక్ష ఇస్తామని హామీ ఇవ్వగా ఈ ప్రభుత్వం మాత్రం బెన్ఫిట్స్‌ను తగ్గించిందని తెలి పారు. ప్రభుత్వం వెంటనే సర్క్యులర్‌ను ఉపసంహరించుకుని కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటరమణ, సదాలమ్మ, జమున రాణి, రత్న కుమారి పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందించాలి

నీటి సరఫరా పర్యవేక్షణ ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి గోపి




మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి గోపి

ములుగు: జిల్లాలోని ఇంటింటికీ తాగునీరు అందించేలా అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని నీటి సరఫరా పర్యవేక్షణ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు బి.గోపి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి సరఫరాపై కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సీహెచ్ మహేందర్‌జీతో కలిసి ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్, మండల ప్రత్యేకాధికారులతో ఆయన సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రాబోయే రెండు నెలలు అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. వేసవిలో నీటి వినియోగం పెరిగి తాగునీటి వనరులు తగ్గిపోతాయన్నారు. ఇలాంటి సమయంలో నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ అధికారులు గ్రామాల్లో తాగునీటిని ట్యాంకుల ద్వారా సరఫరా చేయాలన్నారు. స్థానిక నీటి వనరుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో తాగునీటి సరఫరాను ప్రణాళితో పంపిణీ చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కోరారు. చేతి పంపులు, బోర్ వెల్స్ పనితీరును నిరంతరం అధికారులు పర్యవేక్షించాలని తెలియజేశారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని కోరారు. ఎక్కడైనా సమస్య వస్తే 24గంటల్లోగా పరిష్కరించి నీటిని అందించాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు ఆయా మండలాల్లో ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి చివరి ఇంటివరకు తాగునీరు అందేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో తాగునీటిని అందించేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని వివరించారు. మూడు ఇంటేక్ వెల్స్ ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో నీటి వినియోగంపై ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ తాగునీటి సమస్యలు, నీటి వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, డీఆర్‌డీఏ శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి తుల రవి, జిల్లా పంచాయతీ అధికారిణి స్వరూప తదితరులు పాల్గొన్నారు.


ఉగాది పర్వదిన శుభాకాంక్షలు











ఘనంగా విశ్వబ్రాహ్మణుల ఉగాది

విశ్వబ్రాహ్మణులు ఉగాది పండుగ వేడుకకు ముందు అమావాస్య రోజు తీగదారు పూలతో పందిరి ఏర్పాటు చేసి వారి కులదైవం వీరబ్రహ్మేంద్రస్వామిని ప్రతిష్ఠించుకుని పూజలు చేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నగరంలోని పలువురు విశ్వబ్రాహ్మణులు ఉగాది పండుగను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. వారి వృత్తి సామగ్రిని మోదుగ పూలుతో అలంకరించి, భక్ష్యాలు, ఉగాది పచ్చడి నివేదన చేశారు.



పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

నేడు టీటీడీ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశామని కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. అలాగే శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీమద్రామాయణ సప్తహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు హనుమకొండలోని ఏకశిల పార్కులో గల సీతారామచంద్ర ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, వరంగల్‌లోని హంటర్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణానికి తగిన ఏర్పాట్లు చేశామని ఆయన వెల్లడించారు.

కుజగ్రహం రాజుగా..



ఈ సంవత్సరం కుజగ్రహం రాజుగా ఉండడం జరుగుతోంది. క్రోధి అనే పేరుతో వస్తున్న ఈ కాలం క్రోధ స్వభావం కలిగిన కుజ గ్రహానికి రాజాధిపత్యం వచ్చింది. ఉగాది పండుగ తేదీ 9, వారం మంగళవారం కావడం వల్ల కుజగ్రహం సంపూర్ణంగా బలవంతుడై ఉంటాడు. ఈ సంవత్సరం కఠిన నిర్ణయాలు తీసుకోవడం, న్యాయపర విషయాల్లో గట్టి వైఖరి కలిగి ఉండడం సహజంగా ఏర్పడుతుంది. రాజు కుజుడు కావడంతో ప్రజలు, పాలకుల్లో క్రోధ, ఆవేశాలు పెరగడం, భూ సంబంధ వ్యవహారాలు ఉత్పన్నమవుతాయి. రాజకీయాల్లో ఊహించని పరస్పర వ్యతిరేకాలు తారాస్థాయికి చేరుతాయి.

– శివపురం రామలింగ ఆరాధ్య, విశ్రాంత అర్చకులు, కరీమాబాద్, వరంగల్

శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం



బంతిపూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



హన్మకొండ కల్చరల్ : తెలుగువారి పండుగల్లో యు(ఉ)గాది పండుగ మొట్టమొదటి. పంచాంగం ప్రకారం ప్రతీ ఉగాదికి ఒక్కో పేరు ఉంటుంది.38వది క్రోధి నామ సంవత్సరం. ఇది కోపం కలిగించేది అని చెప్తారు. 'యుగాది'లో యుగం అనగా వయస్సు, ఆది అనగా ప్రారంభమని అర్థం . ఉగాది పండుగ తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా ఆనందానికి, సౌభాగ్యానికి, ఆధ్యాత్మిక చింతనకు, పల్లెలలోని జానపదుల జీవనశైలికి సంకేతంగా నిలుస్తోంది. ఉగాది కాలానికి సంబంధించిన పండుగ. వేప చెట్లు అమృతాన్ని నింపుకున్న పూలతో ప్రకాశిస్తుండగా మామిడి చెట్లు లేలేత పిందెలతో మానవ కల్యాణానికి మంగళగీతాలు పాడుతుండగా మోదుగ చెట్లు నిప్పు కణికలాంటి పూలతో శోభాయమానం చేస్తుండే వసంతకాలంలో రమణీయమైన సొగసులతో అలరారే చైత్రమాసం ప్రారంభమవుతుంది. చైత్ర శుక్ల పాడ్యమి రోజున ప్రతియేటా ఈ పండుగను జరుపుకుంటారు. మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని నగరంలోని పలు కూడళ్లలో కొత్తకుండలు, మోదుగు పూలు, కొత్తచింతపండు, మామిడాకులు, కాయలు, వేప పూలు, చామంతి, గులాబీ, బంతి పూలు, గులాలు, పసుపు, కుంకుమ, గుగ్గిలం తదితర పూజా సామగ్రి అమ్మకాలు సాగాయి.

ఉగాది పచ్చడి ప్రత్యేకత..

ఆయా కాలాల్లో పండించిన వాటిని పండుగల సందర్భంగా దేవుడికి నివేదించిన అనంతరం స్వీకరిస్తాం. చైత్రమాసంలో లభించే చింతపండు, బెల్లం , మామిడి పిందెలు, వేపపూతను కొత్తకుండలో వేసి పచ్చడిగా చేసి భగవత్ నివేదనలుగా సమర్పిస్తారు. తెలంగాణలో ఉగాది పచ్చడిని పానీయంలాగే చేయడం సాంప్రదాయం. దీన్ని షడ్రుచుల సమ్మేళనంగా భావిస్తారు. నిజానికి ఉగాది ప్రారంభంలో మిరపకాయలు లేవు పూర్వం మిర్యాలు వాడేవారు. ఉగాది పచ్చడిలో కొందరు మిర్యాల పొడి వేయడానికి, ఉల్లిగడ్డ ముక్కలు వేయడానికి అదే కారణం. ఉప్పు కూడా కొద్దిగా వేస్తారు. ఉగాది పండుగరోజు దేవుడికి సమర్పించే నివేదనలలో కొత్తబెల్లం, కొత్త శనిగ పప్పు ఉడికించి చేసే భక్ష్యాలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఉగాది పచ్చడి ఎన్నో ఔషధ గుణాలతో కలిగి ఉంటుంది. ముఖ్యంగా కచ్చుమామిడి కాయ, చింతపండు, బెల్లం శరీరంలోని రుగ్మతలను తట్టుకునే శక్తి ఉందని శాస్త్రీయంగా నిరూపితమైంది. వేప పువ్వును పచ్చడిలో వాడటం ప్రత్యేకత. బెల్లంను నేరుగా తింటే శరీరానికి వేడి చేస్తుంది. పానీయంగా వాడితే ఎండనుంచి రక్షించుకోవచ్చు.

38వ తెలుగు సంవత్సరం..
60 తెలుగు సంవత్సరాలలో 38వది క్రోధినామ సంవత్సరం. ఇది కోపానికి సూచిక.. నేడు కొంగొత్త శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఉగాది పర్వదినం నిర్వహిస్తారు.





ఉన్నతవిద్యను బలోపేతం చేయాలి




సింపోజియంలో మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్, పాల్గొన్న అధ్యాపకులు

- హయ్యర్ ఎడ్యుకేషన్ నిర్లక్ష్యానికి గురైంది
- వర్సిటీల్లో అధ్యాపకుల కొరత.. నిధులు కేటాయింపు తక్కువ
- ఉన్నతవిద్యలో ప్రతికూల ప్రభావం
- కేయూలో కుర్టా సింపోజియంలో వక్తలు

కేయూ క్యాంపస్ : యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను బలోపేతం చేసేందుకు, బడ్జెట్‌లో నిధులు అధికంగా కేటాయించాలి. రాష్ట్రంలో గత దశాబ్ద కాలం పాటుగా వర్సిటీల్లోని ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందని అధ్యాపకుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశోధనలపైన ప్రతికూల ప్రభావం చూపిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. వర్సిటీల్లోనూ, డిగ్రీ కళాశాలల్లోనూ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ప్రధానంగా విద్యార్థినుల (అమ్మాయిలు) సంఖ్య బాగా పెరిగిందని అందుకనుగుణంగా వారికి కూడా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగంపై పాలకవర్గాలు విద్యా విధానాలు రూపొందించడంలోనూ అంతగా పట్టించుకోవటం లేదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలోను బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తక్కువగానే కేటాయిస్తున్నారన్నారు. విద్యారంగాభివృద్ధికి గత ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది స్పష్టం అవుతోందని వారు అభిప్రాయపడ్డారు. కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిపాలన భవనంలో నిర్వహించిన సెనేట్ హాల్‌లో రాష్ట్రంలో ఉన్నత విద్య పరిస్థితులు, బలోపేతం అంశంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సింపోజియంనకు కుర్టా అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.సదానందం అధ్యక్షత వహించారు. జనరల్ సెక్రటరీ ఆచార్య వడ్డె రవీందర్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ టి పాపిరెడ్డి, రిటైర్డ్ ఆచార్యులు కూరపాటి వెంకటనారాయణ మాట్లాడారు. ఈ సింపోజియంలో వచ్చిన అభిప్రాయాలపరంగా సూచనలు, సలహాలతో డాక్యుమెంట్ల రూపేణ ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కుర్టా అధ్యక్షుడు సదానందం తెలిపారు.

చదివించినప్పుడే ప్రశ్నించే అవకాశం

వ్యక్తిగా తాను సొంతంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో డబ్బులు పెట్టి చదువుకుంటారు. వారు ఉన్నత విద్యను పూర్తి చేశాక తాము డబ్బులు సంపాదించేందుకే మొగ్గు చూపుతున్నారనేది స్పష్టమవుతోంది. ప్రభుత్వపరంగా విద్యను అందిస్తే సమాజం తనను చదివించింది అనే భావనతో విద్యను పూర్తిచేసిన వ్యక్తుల్లో సేవాభావం ఉంటుంది. అంతేగాకుండా సమాజం కూడా నైతికంగా ప్రశ్నించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ విద్య పటిష్టానికి సమాజంలోకి వెళ్లి సామాజికంగా చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

– హరగోపాల్, సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్

సింపోజియంతో కనువిప్పు కలగాలి



సమాజంలో విద్యావ్యవస్థ కీలకమైంది. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యం. ఆల్‌ఇండియా ఎడ్యుకేషన్ సర్వే రిపోర్టు చూస్తే భారత దేశంలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 28.4 శాతం ఉంటే తెలంగాణలో 40 శాతం వరకు ఉంది. ఇలాంటి సింపోజియం డిబేట్‌ల ద్వారా విద్యారంగ అభివృద్ధికి పలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలి.

– ఆర్.లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్

సరైన విద్యా విధానం లేదు



దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా నేటికి సరైన విద్యా విధానం లేదు. వివిధ ప్రభుత్వాల హయాంలో ఇప్పటి వరకు కోఠారి కమిషన్‌తో పాటు వివిధ కమిషన్లు వేశారు. నూతన జాతీయ విద్యావిధానం–2020 అని అంటున్నారు. కానీ నేటికి సరైన నిర్దిష్టమైన విద్యావిధానాన్ని రూపకల్పన చేయలేకపోయారు. కేంద్రం బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తక్కువగానే కేటాయిస్తోంది.

– తాటికొండ రమేష్, కేయూ, వీసీ

గతంలో వర్సిటీలకు నిధులు ఇచ్చాం

తాను యూజీసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు దేశంలో యూనివర్సిటీలకు రీసెర్చ్‌పర్పస్‌లో వివిధ ఫెలోషిప్స్ ఇచ్చాం. పరిశోధన పరంగా నిధులిచ్చి ప్రోత్సహించాం. తొలుత ఆయన జూమ్ మీటింగ్‌లో న్యూఢిల్లీ నుంచి కొద్ది సేపు మాట్లాడారు. గత పదేళ్లుగా యూజీసీకి నిధులు తగ్గిపోయాయన్నారు. ప్రభుత్వ ఉన్నత విద్యారంగంలో నాణ్యమైన విద్య తదితర అంశాల గురించి ఆయన వివరించారు.

– సుఖ్‌దేవ్‌తోరెట్, యూజీసీ మాజీ చైర్మన్

నాణ్యమైన విద్య అందించాలి



ఇంజనీరింగ్ విద్యలోనూ నాణ్యమైన విద్యను అందించాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థుల్లో ప్రతి ఏడాది బయటికి వస్తున్న వారిలో 30 శాతంమందికి ఉద్యోగానికి సంబంధించిన స్కిల్స్ ఉద్యోగ అర్హతలు ఉండటం లేదు. తాను హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీలో డిగ్రీ పూర్తిచేశాను. తాను సోమవారం ఆ కళాశాలను సందర్శించి చూశాను. రెగ్యులర్ ఫ్యాకల్టీ కొందరే ఉన్నారు. దీంతో విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

– డాక్టర్ మోహన్‌రావు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్

మార్పునకు విద్య ఒక సాధనం



సామాజిక మార్పునకు విద్య ఒక సాధనం. విద్యార్థులు చదువుకోవాలని ఉన్నప్పటికీ వాటికి అనుగుణంగా సదుపాయాలు లేవు. ప్రభుత్వం టీచింగ్ ఫ్యాకల్టీని నియమించాలి. సంపూర్ణంగా అంతర్గతంగా పనిచేసే వాతావరణం కల్పించాల్సి ఉంటుంది. ఉన్నత విద్య రంగాభివృద్ధికి తగినంత నిధులు వర్సిటీలకు కేటాయించాల్సి ఉంటుంది.

– కోదండరామ్, తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు

సైన్స్‌తోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

- సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు

కేయూ క్యాంపస్ : నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సైన్స్‌తోనే సాధ్యమైందని సైన్స్‌పై విద్యార్థులు ఎక్కువగా ఆసక్తిని పెంపొందించుకోవాలని సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు అన్నారు. సోమవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో సైన్స్ విభాగం అధ్యాపకులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు నిజనిర్ధారణ కోసం సైన్స్‌ను ఆశ్రయిస్తారన్నారు. ముఖ్యంగా డీఎన్ఏ పరిశోధనతో వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. రాజకీయ నాయకులు తమ పదవీకాలం ముగియగానే సమాజంలో తెగతెంపులు అవుతాయన్నారు. కానీ శాస్త్రవేత్తకు నిరంతరం పరిశోధనల అనుసంధానం ఉంటుందన్నారు. కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ మాట్లాడుతూ.. అధ్యాపకులు తమకున్న అవకాశాలను అందిపుచ్చుకొనే విధంగా తరగతి గది పరిశోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బోధన, పరిశోధన నిరంతర ప్రక్రియ అన్నారు. కొంతమందికి అవకాశాలు రావడంతో వారి సేవలు సమాజానికి వివిధ రకాలుగా ఉపయోగపడుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి మాట్లాడుతూ.. మానవాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్, అధ్యాపకుడు డాక్టర్ ఆదిరెడ్డి, సైన్స్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా డాక్టర్ మోహన్‌రావు ఈ కళాశాల పూర్వ విద్యార్థి కావడంతో ఆయన కళాశాలను సందర్శించి పలు విషయాలను అడిగి తెలుకున్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్